

ఆక్రమణలకు అడ్డేది..?



పెదవాల్తేరు కూడలిలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు



విద్యుత్ కనెక్షన్‌తో ఏర్పాటు చేసిన పాన్‌షాప్



బస్టాప్‌లో దుకాణాల సామగ్రి

బీచ్‌రోడ్డు: ఆ ప్రాంతంలో నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులు సేవలందిస్తున్నాయి. వాటి చుట్టూ నిరంతరం ప్రజలు తిరుగుతూ ఉంటారు. అటువంటి రద్దీ ప్రాంతంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. పాదచారులు నడిచేందుకు వీలుగా నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడమే కాకుండా బస్ స్టాప్‌లను సైతం వదలకుండా దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ 20వ వార్డులోని పెదవాల్తేరు కూడలి పరిస్థితి ఇది. ఇక్కడి రహదారుల్లోని ఆక్రమణలను అరికట్టడంలో జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు.

రద్దీగా పెదవాల్తేరు కూడలి

పెదవాల్తేరు జంక్షన్‌కు ఒక వైపు జాలరిపేట, మరో వైపు సిరిపురం, ఇంకో వైపు నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల రోడ్డు, లాసన్స్ బే కాలనీకి వెళ్లే మార్గం ఉన్నాయి. ఇలా నాలుగు వైపులా రహదారులతో కూడిన కూడలి ఇది. సాధారణంగానే రద్దీగా ఉండే ఈ జంక్షన్.. అధికారుల నిర్లక్ష్యం వల్ల మరింత బిజీగా మారుతోంది. పెదవాల్తేరు జంక్షన్ మధ్యలోనే వాహనాలను నిలిపి చుట్టుపక్కల దుకాణాలకు వెళ్తున్నారు. ఇక్కడి ఫుట్‌పాత్‌లు, బస్టాప్‌లను కొందరు వ్యాపారులు యథేచ్ఛగా ఆక్రమించి ఫుడ్ కోర్టులు, పాన్ షాపులు, టీ కొట్లు నిర్వహిస్తున్నారు. దీని వలన సాయంత్రం వేళల్లో పెదవాల్తేరు జంక్షన్‌లో పాదచారులు, వాహన చోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు.

దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు

ఇక్కడి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ కూడలిలోని టీ కొట్లు, కిరాణా షాపులు, టిఫెన్ సెంటర్లన్నింటికీ విద్యుత్ కనెక్షన్లు ఉండటం గమనార్హం. ఇలా ఆక్రమించుకున్న దుకాణాలకు కూడా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారంటే ఏ స్థాయిలో ఇక్కడ అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

బస్టాప్ సైతం ఆక్రమణ

పెదవాల్తేరు జంక్షన్ మీదుగా 14 నంబర్ రూట్ బస్ నిరంతరం నడుస్తుంది. ఈ కూడలిలో ప్రయాణికుల కోసం బస్టాప్ నిర్మించారు. దీనిని కొందరు ఆక్రమించి దుకాణాల సామగ్రి పెట్టుకుంటున్నారు. బస్సు వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద కిరాణా షాపులు, మెకానిక్ షాపులు, టీ షాపులు, ట్యాక్సీ సర్వీస్ ఆఫీసుల వంటివి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి.

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

నాలుగు రోడ్ల జంక్షన్ మధ్యలో వాహనాల రాంగ్ పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ మార్గంలో ప్రభుత్వ ఈఎన్‌టీ, ఛాతీ, మానసిక, ఆర్‌సీడీ ఆస్పత్రులున్నాయి. ఈ రహదారి మీదుగా వీఎంఆర్‌డీఏ పార్క్, బీచ్‌కు పెద్ద సంఖ్యలో సందర్శకులు వెళ్తుంటారు. దీంతో ఈ మార్గం వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడి దుకాణాల వద్ద వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపై నిలపడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇతర వాహనాలు రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఇక్కడ ఇటువంటి సమస్యలున్నా.. ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పెదవాల్తేరు కూడలిలో సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

కన్నెత్తి చూడని జీవీఎంసీ అధికారులు

పెదవాల్తేరు నాలుగు రోడ్ల కూడలిలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన అనధికారిక దుకాణాల జోలికి జీవీఎంసీ అధికారులు వెళ్లడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెండు మూడు రోజులు హడావిడి చేసి మళ్లీ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు సహకరిస్తున్నారే ఆరోపణలున్నాయి. ఇందుకు జీవీఎంసీ అధికారులకు, పలు యూనియన్లకు దుకాణదారుల నుంచి పెద్ద మొత్తంలో తాయిలాలు అందుతున్నట్లు సమాచారం.



పెదవాల్తేరు జంక్షన్‌లో నిలిపిన వాహనాలు

క్లుప్తంగా

తాగునీరు వృథా.. రోడ్డుపై వరద



చినవాల్తేరు వద్ద మూలకు చేరిన అన్నా క్యాంటీన్‌లో నిర్వాహకుల పర్యవేక్షణ లోపం వల్ల తాగునీరు వృథాగా పోతోంది. అక్కడి రోడ్డు మీద మురుగు నీటి ప్రవాహాన్ని తలపిస్తోంది.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నూకాలమ్మ జాతరలో మహా అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో కొలువైన నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కాలభైరవుడికి పూజలు



కాలభైరవ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కొలువైన కాలభైరవ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మ భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం, ఇతర సంఘాల సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు అవగాహన



రైల్వే స్టేషన్‌లో టికెట్లు తనిఖీ చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైలు ప్రయాణికుల భద్రత, సౌకర్యం దృష్ట్యా వాల్తేర్ డివిజన్ కమర్షియల్ సిబ్బంది ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్‌లు చేపడుతున్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం టికెట్ తనిఖీలు నిర్వహించారు. సరైన టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించే వారికి, అనుమతి లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణిస్తున్న వారికి, దివ్యాంగ కోచ్‌ల్లో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సరైన టికెట్‌తో, సరైన రైలులో సుఖ ప్రయాణం సాగించాలని ప్రయాణికులకు సూచించారు. రద్దీగా ఉన్న బోగీల్లో ప్రయాణించడం వల్ల దొంగతనాలు, మోసాలు జరిగే అవకాశాలు ఉంటాయని, ఫుట్ బోర్డుపై ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు.

పార్కు స్థలం అప్పగింత.. భానునగర్‌వాసుల హర్షం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లో కబ్జాకు గురైన 450 గజాల పార్కు స్థలాన్ని తిరిగి అప్పగించడంతో నివాసులు ఆనందం వ్యక్తం చేశారు. భానునగర్ అసోసియేషన్ వాసుల పోరాట ఫలితంగా పార్కు స్థలంలోని ఆక్రమణలను శనివారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగించిన విషయం తెలిసిందే. దీనికి సహకరించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయనను కలిసి సత్కరించారు. భానునగర్ వాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, ఒమ్మి నాయుడు, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డితో తూర్పు నాయకులు

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. తాడేపల్లిలోని కార్యాలయంలో ఆదివారం ఆయనను పార్టీ తూర్పు నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తూర్పులోని పార్టీ పరిస్థితి గురించి సజ్జలకు వివరించారు. జీవీఎంసీ మేయర్ అవిశ్వాస తీర్మానంలో పార్టీకి అండగా ఉన్న వారిని ఆయన అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్వల సురేష్, నాయకులు పల్లా దుర్గారావు, పీతల గోవింద్, అక్కరమానిమంగరాజు, పల్లా సుమంత్ తదితరులు ఉన్నారు.

ఏయూను సందర్శించిన ఒడిశా గవర్నర్



ఒడిశా గవర్నర్ హరిబాబుతో ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆదివారం ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం వీసీ కార్యాలయంలో గవర్నర్ భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలను గవర్నర్‌కు వీసీ రాజశేఖర్ వివరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం, విశ్వవిద్యాలయ అవసరాలకు సరిపోయేలా సౌర విద్యుత్ ఉత్పత్తిని జరిపే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ సూచించారు. ఏయూ పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆచార్యులుగా సేవలందించి నేడు ఒడిశా రాష్ట్ర గవర్నర్‌గా సేవలందిస్తున్న హరిబాబును వర్సిటీ తరఫున వీసీ సత్కరించారు.

డ్రైవర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



రిలే దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ వాల్తేర్ డిపో పరిధిలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.సిహెచ్.శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు డ్రైవర్ శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని దీక్షలు ప్రారంభించి 14 రోజులవుతున్నా.. డిపో యాజమాన్యం స్పందించక పోవడాన్ని తప్పుబట్టారు. గతంలో ఇలాంటి ఘటనలో కోర్టు ఆదేశాల మేరకు ఓ ఉద్యోగి సస్పెన్షన్ ఎత్తివేసి ఉద్యోగ నియామకం చేసిన డిపో యాజమాన్యం.. శేఖర్ విషయంలో ఎందుకు కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు. శేఖర్‌ను ఇదే డిపో పరిధిలో తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు పాత్రికేయుల నివాళి



కాళీమాత ఆలయం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

ఏయూక్యాంపస్: పహల్గామ్ ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారికి విశాఖలోని జర్నలిస్టులు నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులకు భారత్ దీటుగా సమాధానం చెప్పాలని నినదించారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఉగ్రవాదం నిర్మూలనలో భారత్‌కు ప్రపంచ దేశాలు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.రాము, కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, ఏపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు డి.హరనాథ్, వాసు, కె.చంద్రమోహన్, చందు యాదవ్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని ఎక్స్‌రే యూనిట్



ఆరిలోవ ఎఫ్ఆర్‌యూలో మూతపడిన ఎక్స్‌రే యూనిట్

ఆరిలోవ: ఆరిలోవలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్(ఎఫ్ఆర్‌యూ) ఆస్పత్రిలో ఎక్స్‌రే విభాగం మూలకు చేరింది. సుమారు రెండేళ్లు దాటినా మూతపడిన ఈ ఎక్స్‌రే యూనిట్ ఇంతవరకు తెరుచుకోలేదు. ఇది ఎప్పుడు తెరుకుంటుందా అంటూ రోగులు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ ఆస్పత్రి ఏర్పాటైనప్పటి నుంచి ఎక్స్‌రే అందుబాటులో ఉండేది. ఆర్థోపెడిక్ సమస్యలతో వెళ్లే వారికి ఇక్కడ నిర్ధారణ కోసం ఎక్స్‌రే ఉచితంగా తీసేవారు. సుమారు రెండేళ్ల కిందట ఈ యంత్రం మరమ్మతులకు గురైంది. అనంతరం ఇక్కడ ఎక్స్‌రే ఆపరేటర్‌ను వేరేచోటకు బదిలీ చేశారు. అప్పటి నుంచి ఎవరినీ నియమించలేదు సరికదా మరమ్మతులకు గురైన యంత్రాన్ని కూడా బాగుచేయకుండా వదిలేశారు. దీంతో ఎక్స్‌రే అవసరమైన రోగులు బయట ల్యాబ్‌లకు వెళ్లి డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక్కడ ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటుచేసి ఆపరేటర్‌ను వెంటనే నియమించాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.

ఉగ్రదాడి శోచనీయం



ఉగ్రదాడి మృతులకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ సంఘ్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో నివాళులు

తాటిచెట్లపాలెం: పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ సంఘ్, వాల్తేర్ డివిజన్, డివిజనల్ సెక్రటరీ డాక్టర్ వి. రవికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా వీరి ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డివిజనల్ సెక్రటరీ డాక్టర్ వి. రవికిరణ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. వీరికి మద్దతుగా నిలిచిన వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీ జి.బాల మురళీకృష్ణ, స్టేట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీఎస్ నాయుడు, లోవరెడ్డి, దేవేంద్ర రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు, వాల్తేర్ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా నృత్య ప్రదర్శనలు



టేకుమళ్ల శ్యామల సీతారాం స్వామిని నాట్య శిరోమణి అవార్డుతో సత్కరిస్తున్న ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు తదితరులు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాట్య ప్రదర్శనలు జరిగాయి. ముగింపు వేడుకలను ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, విశిష్ట అతిథి ఎస్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ డాక్టర్ శ్రీధర్, కూచిపూడి కళాక్షేత్ర జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ కూచిపూడి నృత్య గురువు, నాట్య కళాకారిణి టేకుమళ్ల శ్యామల సీతారాం స్వామికి విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రదానం చేసిన నాట్య శిరోమణి అవార్డును అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగరంలో ఉన్నటువంటి నాట్య గురువుల శిష్యులు 300 మంది చిన్నారులతో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. నాట్య ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులకు అతిథుల చేతుల బహుమతులు ప్రదానం చేశారు. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి, గోపీనాథ్, కన్నం వెంకటరమణల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



అండర్-17 పోటీల విజేతలతో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, సిబ్బంది

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ-వాల్తేర్‌లో ఈ నెల 24న ప్రారంభమైన హైదరాబాద్ రీజయన్, రీజనల్ బాస్కెట్‌బాల్ అండర్-17 పోటీలు ఆదివారంతో ముగిశాయి. హైదరాబాద్ రీజయన్ పరిధిలోని కేంద్రీయ విద్యాలయాల నుంచి మొత్తం 17 టీమ్‌ల బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్స్‌లో హకీంపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు విజేతలుగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ విజేతలను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, క్రీడలను కూడా చదువులో భాగంగా చేసుకోవాలని సూచించారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగభూషణం విజేతలకు మెడళ్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రియాజ్‌ఖాన్, గిరి, రాణి, ప్రధానోపాధ్యాయిని శైలజ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. ముందుగా ఎవరెవరు ఏయే కేసుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మద్యం సేవించి అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు తప్పనిసరిగా రావాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈ క ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా స్టేషన్‌లో..ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలన్నారు. వారి రోజువారీ విధానాలపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉత్తమ అవకాశాలు



పాలిసెట్ గ్రాండ్ టెస్ట్‌ను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గైస్‌లో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం ముగిసిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమికల్ ఇంజినీరింగులో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. మూడున్నరేళ్ల కెమికల్ ఇంజినీరింగు కోర్సులు చేసిన ప్రతి వారికి ఉద్యోగం వస్తుందని ఆయన చెప్పారు. తమ కాలేజీలో చదివిన 171 మందికి ఈ ఏడాది ఉద్యోగాలు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈనెల 30న నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆయన విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాలిసెట్ మోడల్ గ్రాండ్ టెస్టు 150 మంది విద్యార్థులు రాశారు. పరీక్షను ఆయన పర్యవేక్షించారు.